నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
13 | హైదరాబాద్, గురువారం 28 మార్చి 2024 | YADADRI BHUVANAGIRI



మాచారంలో రాయి చెరువును పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

# నాడు కాళేశ్వరం నీటితో రాయిచెరువు కళకళ

## నేడు కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యంతో వెలవెల

- కాల్వల ద్వారా చెరువులు నింపాలనే సోయిలేని ప్రభుత్వం
- రూ.2లక్షల రుణమాఫీ, ఎండిన పంటలకు నష్టపరిహారం అందించాలి
- గ్రామాలకు వస్తే నిలదీస్తారని ఉత్తమ్, కోమటిరెడ్డి కనబడడంలేదు
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- పెన్‌పహాడ్ మండలంలో రాయి చెరువు పరిశీలన

పెన్‌పహాడ్, మార్చి 27 : 'గత ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేయించి వందల కిలోమీటర్ల దూరంలో చిట్ట చివర ప్రాంతమైన పెన్‌పహాడ్ మండలానికి గోదావరి జలాలను తీసుకొచ్చి రాయి చెరువును నింపారు. నాలుగేండ్ల పాటు రాయి చెరువు నీటితో కళకళలాడుతూ మత్తడి దుంకింది. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో వెలవెలబోతున్నది' అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మినీ రిజర్వాయర్ గుర్తింపు ఉండి ఎండిపోయిన మండలంలోని మాచారం రాయి చెరువును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రాయి చెరువుతోపాటు చేతికొచ్చిన పొలాలు ఎండిపోవడం కాంగ్రెస్ ప్రభుత్వం, జిల్లా మంత్రులైన ఉత్తమ్, కోమటిరెడ్డి నిర్లక్ష్యమేనని అన్నారు. తమ ప్రభుత్వంలో జిల్లా అంతటా చెరువులు, కుంటల కింద ఉన్న పొలాల వెంట జాలువారి జమ్మి పుట్టేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరిత వైఖరి, సోయిలేనితనంతో చెరువులు నింపకుండా రైతులకు శిక్ష వేసిందని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. ఇతర పార్టీల వారిపై కేసులు, కొట్లాటలు, పార్టీ కండువాలు కప్పడానికి గేట్లు తెరిచారే తప్ప.. కాల్వల గేట్లు తెరిచి చెరువులు నింపాలనే సోయి లేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కుంగిన పిల్లర్లతో సంబంధం లేకుండా నీళ్లు లిఫ్ట్ చేసే అవకాశం ఉన్నప్పటికీ పట్టించుకోలేదని, 5వేల పైబడి క్యూసెక్కుల నీళ్లు గోదావరిలో కలుస్తున్నాయని తెలిపారు. ఈ వంద రోజుల్లో కనీసం 50 టీఎంసీల నీటిని ఎత్తిపోయించి ఉంటే పోచంపహాడ్ నుంచి పెన్‌పహాడ్ మండలానికి నీళ్లు వచ్చేవని, ఒక్క ఎకరం కూడా ఎండిపోయేది కాదని అన్నారు. కాళేశ్వరం నీళ్లు తెస్తే ఎక్కడ కేసీఆర్‌కు పేరు వస్తుందోనని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించి రైతాంగాన్ని నిలువునా ముంచిందని పేర్కొన్నారు. జిల్లా మంత్రులకు కనీసం అవగాహన లేదు.. అవగాహన పెంపొందించుకోవాలన్న సోయి కూడా లేదని ఎద్దేవా చేశారు. గ్రామాల్లోకి వస్తే నిలదీస్తారని మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి తప్పించుకొని తిరుగుతున్నారన్నారు. దమ్ము ఉంటే, మొనగాళ్లు అయితే ఎండిపోయిన పొలాలను సందర్శించి రైతులకు ధైర్యం కల్పించాలని సవాల్ చేశారు. త్రివేణి సంగమంగా కృష్ణా, గోదావరి, మూసీ నీళ్లతో కళకళలాడిన పెన్‌పహాడ్ మండలంలో నేడు ఎండిన పంటలు దర్శనం ఇస్తున్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలో సాగు చేసిన 3లక్షల ఎకరాలు పూర్తిగా ఎండిపోయాయని, 2014నాటి పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దగా, మోసం అన్నారు. రైతులకు వెంటనే రూ.2లక్షల రుణమాఫీ చేయడంతోపాటు రైతు బంధు, ఎండిన పంటలకు ఎకరానికి రూ.25వేల నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం నారాయణగూడెంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన రైతు నారాయణ లింగారెడ్డి కుటుంబాన్ని, పొట్లపహాడ్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు నారాయణ రాంచంద్రారెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ నెమ్మాది భిక్షం, సూర్యాపేట జడ్పీటీసీ జీడి భిక్షం, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు దొంగరి యుగంధర్, పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, నాయకులు ఉన్నారు.



తాసీల్దార్ బ్రహ్మయ్యకు వినతి పత్రం ఇస్తున్న లబ్ధిదారులు

# డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాలు ఇవ్వాలి

- తాసీల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారుల నిరసన

నాగారం, మార్చి 27 : మండలంలోని డి.కొత్తపల్లి గ్రామ స్టేజీ సమీపంలో పేదల కోసం గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను అర్హులకు ఇవ్వాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తాసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. అనంతరం తాసీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ ఇండ్లు మంజూరై చాలా రోజులు గడుస్తున్నా పట్టాలు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు.

ఎంపికైన 75మంది లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. త్వరగా ఇవ్వకపోతే ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లబ్ధిదారులు దేవరకొండ వెంకన్న, దోమలపల్లి గోవర్ధన్, పడిశాల వెంకటేశ్, మహేశ్, ఎల్లయ్య, నర్సయ్య, రజిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుంకిరెడ్డి నారాయణరెడ్డి, పక్కన సాహితీవేత్త పురుషోత్తమాచార్యులు

# నాటక సాహిత్యంపై విస్తృత పరిశోధనలు రావాలి

- ప్రముఖ సాహితీ వేత్త, పరిశోధకుడు సుంకిరెడ్డి నారాయణరెడ్డి

రామగిరి, మార్చి 27 : నాటక సాహిత్యంపై విస్తృతమైన పరిశోధనలు రావాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా నేటి యువతరాన్ని ప్రోత్సహించాలని ప్రముఖ సాహితీ వేత్త, పరిశోధకుడు డాక్టర్ సుంకిరెడ్డి నారాయమణరెడ్డి అన్నారు. నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల(ఎన్జీ)లో కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి సౌజన్యంతో 'తెలుగు నాటకం–సాహిత్య సమాలోచన' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహించే జాతీయ సదస్సులో భాగంగా తొలి రోజు బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై సదస్సును ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి సదస్సులు నాటక సాహిత్యంపై ఆసక్తిని పెంపొందింపజేయడమే కాకుండా విద్యార్థులను పరిశోధకులుగా, సాహిత్య అభిమానులుగా తీర్చిదిద్దేటట్లు చేస్తాయని అన్నారు. ఎంతోమంది నాటక రచయితల రచనలు నేటి సాహితీ లోకానికి అందడం లేదని, వారి సాహిత్యాన్ని వెలికితీసి భావితరాలకు అందజేయాల్సిన అవసరం కవులు, రచయితలు ఇతర సాహితీవేత్తలపై ఉందన్నారు. ప్రముఖ సాహితీవేత్త, జాతీయ ఉత్తమ సినీ విమర్శక అవార్డు గ్రహీత డాక్టర్ పురుషోత్తమాచార్యులు మాట్లాడుతూ.. తెలుగు నాటక రంగం ఆరంభ వికాసాలను గురించి సమగ్రంగా వివరించారు. నాటక రచయితతోపాటు నటులు, నాటక ప్రయోక్త తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించినప్పుడే ఆ నాటకం జనరంజకమవుతుందన్నారు. ఆత్మీయ అతిథి కమలాకరశర్మ మాట్లాడుతూ నాటక రంగం మనోరంజకమైందని, కానీ నేడు సినిమాల ప్రభావంతో కనుమరుగైపోయే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.

ఎన్జీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు తండు కృష్ణకౌండిన్య సారథ్యంలో జరిగిన సదస్సులో తెలుగు యూనివర్సిటీ ఆర్ట్స్ ఫ్యాకల్టీ ఆఫ్ డీన్ ప్రొఫెసర్ కరిమిళ్ల లావణ్య, ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్, వివిధ కళాశాలల అధ్యాపకులు లవేందర్‌రెడ్డి, శ్రీధర్, గోవర్ధనగిరి, సైదులు, ప్రభాకర్, లింగస్వామి, రమ్య, అంజయ్య, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# తుపాకులు పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేయాలి

- నల్లగొండ జిల్లా ఎస్పీ చందనాదీప్తి



నల్లగొండ సిటీ, మార్చి 27 : లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా లైసెన్స్‌డ్ తుపాకులు పొందిన నాయకులు, వ్యాపారులు, ప్రముఖులు వెంటనే ఆయా పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేయాలని జిల్లా ఎస్పీ చందనా దీప్తి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 136 లైసెన్స్ కలిగిన ఆయుధాలు ఉన్నాయని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు, శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. 1959 సెక్షన్ 21 ఆయుధాల చట్టం ప్రకారం లైసెన్స్ ఆయుధాలు కలిగి ఉన్నవారు వెంటనే డిపాజిట్ చేయాలని సూచించారు. అలా చేయని వారిపై ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డిపాజిట్ చేసిన ఆయుధాలను ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత తీసుకోవచ్చని తెలిపారు. జాతీయ బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే భద్రతా సిబ్బందికి, గార్డు డ్యూటీలో ఉన్న వారికి మినహాయింపు వర్తిస్తుందని పేర్కొన్నారు.

# పార్లమెంట్ ఎన్నికలపై ఫోకస్


## ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా యంత్రాంగం

- కార్యకలాపాలన్నీ భువనగిరిలోనే..
- ఏర్పాట్లలో నిమగ్నం
- ప్రత్యేక బృందాలు, సిబ్బంది నియామకం
- ప్రచార ఖర్చులు, కోడ్ ఉల్లంఘన పర్యవేక్షణకు ప్రత్యేక టీమ్‌లు
- బ్యాంక్, ఆన్‌లైన్ లావాదేవీలపై నిఘా
- సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు, నిరంతరం తనిఖీలు
- మద్యం, నగదు రవాణాపై నజర్
- ఓటర్లు, పోలింగ్ శాతం పెంచేందుకు చర్యలు



సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో ఏర్పాట్లలో నిమగ్నమైంది. కోడ్ అమలులో ఉండటంతో అన్ని రకాల వ్యవహారాలపై నజర్ పెట్టింది. బ్యాంక్ లావాదేవీలు, ఆన్‌లైన్ చెల్లింపులపై నిఘా పెంచింది. ప్రచార ఖర్చులు, కోడ్ ఉల్లంఘనల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలను నియమించింది. సరిహద్దు ప్రాంతాల్లో పోలీస్ చెక్ పోస్టులను ఏర్పాటు చేసింది. సోషల్ మీడియా ఖాతాలపై కన్నేసింది. ఇటీవల తొలి ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా సిబ్బందిని నియమించింది.

– యాదాద్రి భువనగిరి, మార్చి 27 (నమస్తే తెలంగాణ)



### ప్రత్యేక బృందాలు, సిబ్బంది నియామకం..

ఎన్నికల నిర్వహణ కోసం ఉన్నతాధికారులకు వివిధ రకాల బృందాలను ఏర్పాటు చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు 54టీమ్‌లు, ఫ్లయింగ్ సర్వైలెన్స్ టీమ్‌లు 23, స్టాటిస్టిక్ సర్వైలెన్స్ టీమ్‌లు 23, వీడియో వ్యూయింగ్ బృందాలు తొమ్మిదింటిని నియమించారు. ఎన్నికల నిర్వహణకు కావాల్సిన వెబ్‌క్యాస్టింగ్, రూట్, సెక్టోరియల్, పోలింగ్, ఇతర సిబ్బందిని సిద్ధం చేస్తున్నారు. పోలింగ్ సిబ్బంది కోసం మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా 1.052 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1054 ఏపీఓలు, 2156 ఓపీఓలను నియమించారు. మహిళలు, దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు సౌకర్యవంతంగా మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అన్ని కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మౌలి సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈవీఎంలు, వీవీప్యాట్లను గోదాముల్లో సిద్ధంగా ఉంచారు.

### ఎన్నికల కార్యకలాపాలన్నీ భువనగిరిలోనే..

దేశవ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. తెలంగాణలో నాలుగో విడతలో ఎన్నికలు ఉండనున్నాయి. కోడ్ అమల్లోకి రావడంతో ఇప్పటికే వాల్ పోస్టర్లు, వాల్ రైటింగ్‌లను తొలగించారు. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల కానుండగా, మే 13న పోలింగ్ జరుగనుంది. భువనగిరి పార్లమెంట్ స్థానానికి సంబంధించి రిటర్నింగ్ అధికారిగా యాదాద్రి భువనగిరి కలెక్టర్ వ్యవహరించనున్నారు. ఈ పార్లమెంట్ పరిధిలో భువనగిరి, జనగాం, ఆలేరు, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు, ఇబ్రహీంపట్నం నియోజవకర్గాలు ఉన్నాయి. వీటిన్నింటి కార్యకలాపాలు భువనగిరి కేంద్రంగానే జరగనున్నాయి. కౌంటింగ్ ప్రక్రియ కూడా భువనగిరి జిల్లాకేంద్రంలోని అరోరా కాలేజీలో చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు.

### బ్యాంక్, ఆన్‌లైన్ లావాదేవీలపై నిఘా..

ప్రచార ఖర్చు, కోడ్ ఉల్లంఘనలపై ప్రత్యేక బృందాలను నియమించారు. పార్లమెంట్ పరిధిలోని వివిధ సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. మొత్తంగా 23 చెక్ పోస్టులు పెట్టారు. మద్యం, నగదు రవాణాపై నిఘా పెంచారు. ప్రతి వాహనాన్ని క్షుణ్నంగా తనిఖీ చేస్తున్నారు. ఆధారాలు లేకుండా రూ.50వేల మించి నగదు రవాణా చేస్తే సీజ్ చేస్తున్నారు. బంగారం రవాణా చేస్తే బిల్లులు ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ఈసారి బ్యాంక్ లావాదేవీలు, ఆన్‌లైన్ చెల్లింపులపైనా దృష్టి పెట్టారు. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు రూ.50వేల కంటే ఎక్కువగా చెల్లింపులు జరిగితే సమాచారం ఇవ్వాలని ఎన్నికల అధికారులు బ్యాంకులను ఆదేశించారు. మరోవైపు సోషల్ మీడియా ఖాతాలపై స్పెషల్ ఫోకస్ పెట్టనున్నారు.

### పోలింగ్ శాతం పెంచేందుకు చర్యలు

పార్లమెంట్ పరిధిలో పోలింగ్ శాతం పెంచేందుకు అధికారులు ఫోకస్ పెట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో పోలింగ్ శాతం గణనీయంగా పెరిగింది. ఈసారి కూడా ఇదే తరహాలో పెంచేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే ఓటరు నమోదు, ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్నారు. ఓటుపై యువతకు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థుల నామినేషన్ దాఖలు వరకు ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలో మొత్తం 18,00,398 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో అత్యధికంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 3,37,389 మంది ఉన్నారు.

# ఎన్నికలపై పీఓ, ఏపీఓలకు శిక్షణ

- ఏప్రిల్ 1, 2న ఏర్పాటు
- కలెక్టర్ హనుమంతు కె. జెండగే



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే

యాదాద్రి భువనగిరి, మార్చి 27 (నమస్తే తెలంగాణ) : వచ్చే నెల ఒకటి, రెండు తేదీల్లో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె. జెండగే తెలిపారు. బుధవారం కాన్ఫరెన్స్ హాల్‌లో పీఓ, ఏపీఓల శిక్షణ కార్యక్రమాల ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 1, 2 తేదీల్లో భువనగిరి పట్టణంలోని వెన్నెల కాలేజీలో ఉదయం 9 నుంచి 1.30 వరకు, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. జిల్లాలో విధులు కేటాయించిన ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉండి ఎన్నికల విధులకు హాజరు కావాలని, ఎలాంటి మినహాయింపూ లేదని, ఎవరైనా విధులకు గైర్హాజరైతే రిప్రజెంటేటివ్ ఆఫ్ పీపుల్ యాక్ట్ 1951 ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓ అధికారుల పాత్ర కీలకమన్నారు. పోలింగ్ రోజు నిర్వహించాల్సిన విధులు, ఈవీఎం యంత్రాలపై పూర్తి అవగాహన కలిగించాలని, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను పోలింగ్ కేంద్రాల్లో అమర్చడం, మాక్ పోలింగ్ నిర్వహణ, ప్రిసైడింగ్ అధికారుల హ్యాండ్ బుక్‌లోని ప్రతి అంశాన్ని వారికి వివరించాలన్నారు. ప్రిసైడింగ్ ఆఫీసర్ హ్యాండ్ బుక్ లో సూచించిన విధంగా మొత్తం పోలింగ్ సామగ్రిని పొందడం, ఫారాలు, కవర్స్, మెటీరియల్స్, మాక్ పోల్ సర్టిఫికెట్ ఇచ్చే విధానంపై, ఈవీఎం యంత్రాల క్లోజింగ్, రిజల్ట్, క్లియర్ వ్యవస్థలు, వీవీప్యాట్ స్లిప్‌లు, పోలింగ్ సందర్భంలో కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్, బ్యాలెట్ యూనిట్లలో ట్రబుల్ షూట్స్‌పై అవగాహన కల్పించాలని వివరించారు. పోలింగ్‌కు 90 నిమిషాల ముందు మాక్‌పోల్ నిర్వహణ, మాక్ పోల్ సమయంలో కనీసం 50 ఓట్లు వేయడం, నిర్ణీత సమయానికి పోలింగ్ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవడం, ఓటింగ్ గోప్యత నిబంధనలు, బ్యాలెట్ గోప్యతను కాపాడే విధంగా ఓటింగ్ కంపార్ట్మెంట్లను ఏర్పాటు చేసుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. పోలింగ్ స్టేషన్ ప్రాంతం, ఓటర్ల వివరాలు తెలిపే నోటీసు బోర్డులు, ఫారమ్–7లో పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను పోలింగ్ స్టేషన్ బయట ప్రదర్శించడం, పోలింగ్ సందర్భంలో వచ్చే టెండర్ ఓటు, చాలెంజ్ ఓట్లపై అవగాహన, పోలింగ్ పూర్తయిన తర్వాత కంట్రోల్ యూనిట్‌లో క్లోజ్ బటన్ పోలింగ్ ఏజెంట్ల ముందు చేసి డిక్లరేషన్ ఇవ్వడంపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రిసైడింగ్ ఆఫీసర్ హ్యాండ్ బుక్‌లోని సూచనల ప్రకారం అన్ని పత్రాలను సీల్ చేయడంపై రీసెర్చ్ పర్సన్స్ (అసెంబ్లీ స్థాయి ట్రైనర్స్) తగిన శిక్షణ అందించాలని తెలిపారు. శిక్షణ తరగతులకు హాజరయ్యే పీఓ, ఏపీఓల నుంచి పోస్టల్ బ్యాలెట్ 12, 12–ఏ ఫామ్స్ ద్వారా వివరాలు పొందాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.బెన్ షాలోమ్, ఆర్డీఓలు అమరేందర్, శేఖర్ రెడ్డి, నోడల్ అధికారులు కె.నారాయణ రెడ్డి, జయపాల్ రెడ్డి, విద్యాసాగర్, ఏఓ జగన్మోహనప్రసాద్ పాల్గొన్నారు.

# పట్టుబడిన ప్రతి వస్తువుకూ రసీదు ఇవ్వాలి

- సూర్యాపేట జిల్లా కలెక్టర్ వెంకట్రావ్



కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట, మార్చి 27 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో చెక్‌పోస్టులు, ఇతర తనిఖీల్లో పట్టుబడిన నగదు, వస్తువులకు బాధితులకు రసీదు అందించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని అన్ని చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచాలని, ఎఫ్‌ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, పోలీస్, ఎక్సైజ్ టీమ్‌లు నిరంతరం ముమ్మర తనిఖీలు చేయాలని ఆదేశించారు. తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం, వెండి, ఇతర సామగ్రిని కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చాలని సూచించారు. వాటిని గ్రీవెన్స్ సెల్ ద్వారా బాధితులకు అందించనున్నట్లు తెలిపారు. అందుకు బాధితులు సరైన ఆధారాలు చూపించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు రూ.85.18 లక్షల నగదు, రూ.69 లక్షల విలువ చేసే 4,437 లీటర్ల మద్యం, రూ.23.32 లక్షల విలువైన బంగారం, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న వాటి విలువ మొత్తం రూ.1,77,62,000 వరకు ఉంటుందని పేర్కొన్నారు.

# ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి




ఏసీబీకి పట్టుబడిన పంచాయతీ కార్యదర్శి కిరణ్

మోత్కూరు, మార్చి 27 : మండలంలోని పొడిచేడు గ్రామ పంచాయతీ కార్యదర్శి బుధవారం రూ.3వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ జగదీశ్‌చందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పొడిచేడు పంచాయతీ కార్యదర్శి చిన్నం కిరణ్ గ్రామానికి చెందిన గొరిగే మహేశ్ ఇంటి పర్మిషన్ కోసం గతంలో రూ.8వేల లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో రెండు సంవత్సరాల క్రితం మహేశ్ రూ.5వేలు ఇచ్చాడు. మరో రూ.3వేలు కూడా ఇవ్వాలని కిరణ్ డిమాండ్ చేయడంతో మహేశ్ టోల్ ఫ్రీ నంబర్ 1064 ద్వారా ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు బుధవారం పంచాయతీ కార్యదర్శికి రూ.3వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. నిందితుడిని ఏసీబీ కోర్టులో రిమాండ్ చేయనున్నట్లు ఏసీబీ డీఎస్పీ జగదీశ్‌చందర్ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు రామారావు, వెంకట్రావు పాల్గొన్నారు.

# నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు

- ప్రతి కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి
- రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ, మార్చి 27 : యాసంగి ధాన్యాన్ని నేటి నుంచి కొనుగోలు చేయనున్నందున అన్ని కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో గత సమస్యలు పునరావృతం కాకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలకు సూచించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, నీడ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. నాణ్యతా ప్రమాణాల ప్రకారం తేమ, తాలు శాతం సరిగా ఉండేలా చూసుకోవాలని, ఈ విషయంపై కొనుగోలు కేంద్రాల నిర్వహకులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతుల వద్ద నుంచే ధాన్యం కొనుగోలు చేయాలని, మధ్య దళారుల ప్రమేయం ఉండరాదని అన్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, అక్కడ నిరంతరం తనిఖీలు ఉంటాయని తెలిపారు. బయటి రాష్ట్రం నుంచి వచ్చే ధాన్యాన్ని కొనుగోలు చేస్తే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు సందర్భంలో ఏవైనా సమస్యలు వస్తే స్థానిక తాసీల్దార్, ఆర్డీఓలు పరిష్కరించడానికి అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రభుత్వం గ్రేడ్–ఏ ధాన్యానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 మద్దతు ధర చెల్లిస్తుందని చెప్పారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రజా ప్రతినిధులు ప్రారంభించకూడదని, ప్రారంభంలో పాల్గొనకూడదని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద రాజకీయపరమైన ఫ్లెక్సీలు ఉండకూడదని, ఈ విషయంలో నిర్వాహకులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. లేదంటే కోడ్ ఉల్లంఘన కింద క్రిమినల్ కేసులు నమోదు అవుతాయని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలులో పౌరసరఫరాలు, డీఆర్డీఏ, వ్యవసాయ, జిల్లా కో ఆపరేటివ్, మార్కెటింగ్, తూనికలు, కొలతలు, ట్రాన్స్‌పోర్టు శాఖలు సమన్వయంతో పనిచేసి రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ నాగేశ్వర్‌రావు, డీఆర్డీఓ నాగిరెడ్డి, డీసీఓ కరుణాకర్, డీఏఓ శ్రవణ్‌కుమార్, జిల్లా తూనికలు, కొలతల అధికారి రామకృష్ణ, జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.